సాక్షి వికారాబాద్

మంగళవారం, 13, మే, 2025



కార్పొరేట్ వైద్యం

కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 8లో▸



ఇళ్ల దరఖాస్తుల వడపోత

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల జాబితా సిద్ధమవుతోంది. 8లో▸



రేషన్‌కార్డులు ఎప్పటికో.?

కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఎదురుచూపులు తప్పడంలేదు. 9లో▸

న్యూస్‌రీల్

నేడు స్పీకర్ పర్యటన

మోమిన్‌పేట: మండల పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు మంగళవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ విచ్చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సుద్దోడ్కతండా బీటీ రోడ్డు, ఏన్కతల పెద్ద చెరువు మరమ్మతులు, మల్‌రెడ్డిగూడెం చెరువు మరమ్మతులు, మొరంగపల్లి, ఎన్కేపల్లి, కేసారం, సయ్యద్‌అల్లిపూర్, ఇబ్రాహీంపల్లి, వెల్‌చాల్, దుర్గంచెర్వు గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. పార్టీ శ్రేణులు సకాలంలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



టాస్ వేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ యాదగిరి

దుద్యాల్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం మండల స్థాయి క్రికెట్ పోటీలు(దుద్యాల్ క్రికెట్ ప్రీమియర్ లీగ్) ప్రారంభమయ్యాయి. కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, ఎస్ఐ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు, యువకులు, ఉద్యోగుల కోసం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.7 వేలు, రెండో స్థానంలో నిలిచే జట్టుకు రూ.5 వేలు నగదు బహుమతి అందజేయనున్నట్లు నిర్వాహకులు నరేందర్, శ్రీకాంత్, అనిల్, కేశవులు, గాంధీ, సంతోష్, ఫరీద్ తెలిపారు.

భూ భారతికి 43 దరఖాస్తులు



భూ సమస్యలపై అర్జీలు ఇస్తున్న చింతకుంట గ్రామ రైతులు

ధారూరు: మండలంలోని ఎబ్బనూర్, హరిదాస్‌పల్లి, చింతకుంట గ్రామాల్లో సోమవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు 43 అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ఇకపై గ్రామాల్లోనే భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు సాజిదాబేగం, శ్రీనివాస్, దీపక్ సాంసన్ పాల్గొన్నారు. మంగళవారం కుమ్మర్‌పల్లి, దోర్నాల్, గురుదోట్ల గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ర్యాంకుల 'కమ్మదనం'



సిరి (2,234)



శ్రీహర్షిత (4,643)



శిరీష (4,907)



సౌమ్య (7,586)



కీర్తన (8,741)

షాద్‌నగర్ రూరల్: ప్రభుత్వం ప్రకటించిన ఈఏపీ సెట్ ఫలితాల్లో ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకుల విద్యార్థినులు సత్తాచాటారు. బైపీసీ విభాగంలో సిరి 2,234 ర్యాంకు, శ్రీహర్షిత 4,643, శిరీష 4,907, సౌమ్య 7,586, కీర్తన 8,741 ర్యాంకు, ఎంపీసీ విభాగంలో శైలజ 22,990 ర్యాంకు, సాయికీర్తన 25,903, మానస 27,493, సాయిప్రియ 28,577 ర్యాంకులు సాధించారు. 77 మంది ఇంటర్ పరీక్షలు రాయగా వంద శాతం ఉత్తీర్ణత సాధించామని ప్రిన్సిపల్ విద్యుల్లత తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పాటు సిబ్బందిని అభినందించారు.

కానరాని క్వాలిటీ



ఏడాదిన్నరకే దెబ్బతిన్న గాజీపూర్-బుద్ధారం వంతెన

రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించక మూణ్నాళ్లకే పాడవుతున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నా పర్యవేక్షణ లోపంతో అవి దుర్వినియోగం అవుతున్నాయి. అధికారులను పర్సెంటేజీల పేరిట ప్రసన్నం చేసుకుంటున్న కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేపట్టడంతో అవి అధ్వానంగా మారుతున్నాయి.

ఇసుకకు బదులు డస్ట్ వాడుతున్న కాంట్రాక్టర్లు

- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- పర్సెంటేజీల మాటున పర్యవేక్షణ కరువు
- మంజూరవుతున్న నిధుల్లో 50 శాతమే పనులకు
- మూణ్నాళ్ల ముచ్చటగా అభివృద్ధి పనులు

వికారాబాద్: ఫొటోలో కనిపిస్తున్న పెద్దేముల్ మండలం గాజీపూర్–బుద్ధారం వంతెన నిర్మాణానికి రూ.3.30 కోట్ల నిధులు వెచ్చించారు. ఐదేళ్ల క్రితం ప్రారంభించిన పనులు 2023 ఏడాది చివరిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏడాది తిరక్కుండానే వంతెనపై సిమెంట్ పెచ్చులూడి చువ్వలు తేలాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఇలా అన్ని విభాగాల్లోనూ నాణ్యతను విస్మరించి అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

నాణ్యత నేతిబీర చందమే..

అభివృద్ధి పనుల్లో క్వాలిటీ పూర్తిగా కంట్రోల్ తప్పుతోంది. పనులు నిర్వహించే శాఖ ఏదైనా నాణ్యత మచ్చుకైనా కనిపించడం లేదు. కోట్లు వెచ్చించి చేపడుతున్న అభివృద్ధి పనులు ఏడాది తిరక్కుండానే పాడవుతున్నాయి. ఇంజనీరింగ్ వ్యవస్థ గాడి తప్పింది. పనులేవైనా పర్సెంటేజీలే పరమావధిగా వ్యవహారం కొనసాగుతుందనే అపవాదు ఉంది. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ ఇలా శాఖ ఏదైనా పనుల పర్యవేక్షణ పట్టించుకునే వారు కరువయ్యారు. వర్క్ ఇన్‌స్పెక్టర్, ఏఈ, డీఈ, ఈఈ, జిల్లా స్థాయి అధికారులు, క్యూసీ(క్వాలిటీ కంట్రోల్) అధికారులు అంతా మామూళ్ల మత్తులో ఉన్నారనే విమర్శలు వస్తున్నాయి. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారం పనులు చేపట్టడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. ఇంజనీరింగ్ విద్యనభ్యసించిన కలెక్టర్ పనుల నాణ్యతపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

50 శాతమే నిధుల వినియోగం

అభివృద్ధి పనులు కాంట్రాక్టర్లు చేపట్టినా.. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చేపట్టినా అధికారుల వాటా ముట్టజెప్పాల్సిందే అనే చర్చలు వినిపిస్తున్నాయి. ఏఈకి ఐదు శాతం,డీఈకి మూడు శాతం, ఈఈకి రెండు శాతం,సెక్షన్‌లో రెండు శాతం,క్యూసీకి రెండు శాతం ఇలా మొత్తంగా ప్రతీ పనికి 14 నుంచి 15 శాతం వరకు పర్సెంటేజీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.కాంట్రాక్టర్లకు పనులు ఇప్పించే ప్రజాప్రతినిధులు ప్రతీ పనికి 15 శాతం వరకు తీసుకుంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా కాంట్రాక్టర్లు 30శాతం పర్సెంటేజీలు ఇస్తూ.. మరో 20 శాతం వారి లాభాలను కలుపుకొని ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల్లో 50శాతం మాత్రమే పనులకు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇసుకకు బదులు డస్ట్

కాంట్రాక్టర్లు సిమెంట్ పనుల్లో ఇసుకకు బదులుగా డస్ట్ వినియోగిస్తున్నారు. 20 శాతం ఇసుకకు 80 శాతం డస్ట్ కలుపుతున్నారు. మార్కెట్‌లో ఒక లారీ ఇసుకకు రూ.50వేల వరకు ఉంటుండగా డస్ట్‌కు రూ.10 వేలలోనే లభిస్తుంది. దీంతో కాంట్రాక్టర్లు డస్ట్ వినియోగిస్తూ.. అధికారులు ఇస్తున్న అంచనాల్లో ఇసుక వాడుతున్నట్లు చూపుతున్నారు. బిల్లులు దండుకుంటున్న కాంట్రాక్టర్లు



డస్ట్ వాడుతుండడంతో చేపట్టిన పనులు వెంటనే పాడవుతున్నాయి.

రూ. వందల కోట్లతో పనులు

ప్రతీ ఏడాది జిల్లాకు మహాత్మాగాంధీ ఎన్ఆర్ఈజీఏలో మెటీరియల్ కంపోనెంట్ కింద ప్రభుత్వం రూ.50–రూ.60 కోట్ల నిధులు కేటాయిస్తోంది. సీడీపీ, జెడ్పీ, సెంట్రల్ నిధులు, ప్రజా ప్రతినిధుల చొరవతో మంజూరు చేయించే నిధులు కలుపుకొంటే మొత్తంగా జిల్లాలో పంచాయతీ రాజ్ విభాగం ద్వారానే రూ.వంద కోట్ల వరకు పనులు జరుగుతున్నాయి. మరో రూ.వంద కోట్లకుపైగా ఆర్అండ్‌బీ, మున్సిపాలిటీలకు మంజూరయ్యే నిధులు, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, హెల్త్, ఎడ్యుకేషన్ ఇలా వివిధ రకాల నిధులతో ప్రతి ఏటా పనులు చేపడుతుండగా నాణ్యత పాటించడం లేదు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీ, భవన నిర్మాణాల పనులు చేపడుతుండగా ఇంజనీరింగ్ అధికారుల నిర్వాకంతో పనులు మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి.

"చర్యలు తీసుకుంటాం

నాణ్యత విషయంలో రాజీ ఉండదు. నిబంధనల ప్రకారమే పనులు చేయించేలా చూస్తాం. ఎక్కడయినా అలాంటివి ఉంటే పర్యవేక్షిస్తాం. అవసరమైతే మళ్లీ వేయిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వివరణ ఇవ్వాల్సిందే. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. పెద్దేముల్ సమీపంలో పాడైన వంతెనను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.

– లాల్‌సింగ్, ఈఈ, ఆర్అండ్‌బీ

ప్రజావాణికి 68 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 68 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర, ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో అడ్మిషన్లకు 'దోస్త్'లో రిజిస్ట్రేషన్ చేసుకోండి

షాద్‌నగర్ రూరల్: ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీలో అడ్మిషన్ కోసం వెంటనే దోస్త్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె సూచించారు. ఈనెల 21 వరకు అవకాశం ఉందని తెలిపారు. 29న అడ్మిషన్ల కేటాయింపుపై తొలి జాబితా విడుదలవుతుందని పేర్కొన్నారు. ఈనెల 30 నుంచి జూన్ 6 వరకు అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. వివరాలకు 63050 51490, 9885003390, 9703441345 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇబ్రహీంపట్నం కళాశాలలో..

ఇబ్రహీంపట్నం: 2025–26 విద్యాసంవత్సరానికి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్) ద్వారా ప్రథమ సంవత్సరంలో విద్యార్థులు చేరేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా.రాధిక సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 89199 96725, 94417 05076, 93810 6920 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- త్వరలో సీటీ స్కాన్, ఎంఆర్ఐ సదుపాయం
- వచ్చే విద్యాసంవత్సరంలో వైద్య విద్యార్థులకు హాస్టల్స్ నిర్మాణం
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- వికారాబాద్‌లో 300 పడకల జనరల్ ఆస్పత్రి ప్రారంభోత్సవం



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో కలిసి 300 పడకల ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, చిత్రంలో మండలి చీఫ్ విప్ పట్నం, ఎంపీ కొండా, ఎమ్మెల్యేలు టీఆర్ఆర్, బీఎంఆర్ తదితరులు

అనంతగిరి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం ఆయన వికారాబాద్ పట్టణంలో రూ.30 కోట్లతో నిర్మించిన 300 పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణ, అన్ని విభాగాలను, తరగతి గదులను పరిశీలించారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి సీనియర్ నర్సులు శంకరమ్మ, శాంతమ్మలను సత్కరించారు. అనంతరం మెడికల్ కళాశాల విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిగిలో ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన, వికారాబాద్‌లో ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించుకున్నామన్నారు. వికారాబాద్‌లో అందుబాటులోకి వచ్చిన 300 పడకలు ప్రారంభించుకున్నామని, 50 పడకల క్రిటికల్ కేర్, పాత ఆస్పత్రిలో 70 పడకలు మొత్తం 420 పడకలు అందుబాటులోకి వచ్చాయన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో మెడికల్ కళాశాల విద్యార్థులకు బాలుర, బాలికలకు వేర్వేరుగా పక్కా వసతి గృహ భవన నిర్మాణాలతో పాటు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెడుతామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సీటీ స్కాన్, ఎంఆర్ఐ సదుపాయాలను అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంచంద్రయ్య, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, డీఎంహెచ్ఓ వెంకటరవణ, డీసీసీబీ మెంబర్ కిషన్‌నాయక్, ఆర్టీఏ సభ్యుడు జాఫర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, మాజీ లైబ్రరీ చైర్మన్ ఎండీ హఫీజ్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, జిల్లా అధికారులు, వైద్యులు, సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో రెండేళ్లలో వంద పడకల ఆస్పత్రి



వందపడకల ఆస్పత్రి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తదితరులు

పరిగి: పేదలకు ఆత్మస్థైర్యం నింపేలా ప్రభుత్వ వైద్య సేవలు ఉండాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం ఆయన పరిగి పట్టణ కేంద్రంలో రూ.27 కోట్లతో నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండేళ్లలో పరిగిలో వంద పడకల ఆస్పత్రి సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి అన్ని రకాల స్పెషాలిటీ వైద్య సేవలను విస్తరిస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఎప్పుడు కలిసిన నియోజకవర్గ అభివృద్ధిపైనే మాట్లాడుతారన్నారు. డయాలసిస్ సెంటర్‌లో బెడ్లు, మిషన్ల సంఖ్యను పెంచి కిడ్నీ వ్యాధిగ్రస్తులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. జాతీయ ప్రధాన రహదారులపై ప్రతీ 20 కిలోమీటర్లకు ఒక ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 213 కొత్త అంబులెన్స్‌లను ప్రారంభించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఎనిమిది మెడికల్ కళాశాలలు, 16 నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేయడంతో 400 మంది విద్యార్థులకు అదనంగా సీట్లు వస్తున్నాయన్నారు. పరిగిలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే కోరారని పరిశీలించి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. బీపీ, షుగర్, క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోందని వీరికి వైద్యం అందించేందుకు అన్ని జిల్లాలో ఎన్‌సీడీ క్లినిక్ ఏర్పాటు చేశామని తెలిపారు. త్వరలోనే రాష్ట్రంలో నాలుగు దిక్కుల నాలుగు రీజనల్ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నామన్నారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ఫెడరేషన్ చైర్మన్ కల్వ సుజాత, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పరిగి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్లు పరశురాంరెడ్డి, ఆంజనేయులుముదిరాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలో చేపడుతున్న వైద్య సేవలు, కార్యక్రమాలను వివరిస్తున్న డీఎంహెచ్ఓ వెంకటరవణ

ఫిర్యాదులు అందితే చర్యలు

- వైద్యాధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి
- కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష సమావేశం

అనంతగిరి: వైద్యాధికారులు బాధ్యతాయుతంగా సేవా దృక్పథంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం వికారాబాద్ కలెక్టరేట్‌లో స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఉన్నతాధికారులు, అధికారులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రుల, వైద్య కళాశాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, బ్లడ్‌బ్యాంక్, వైద్యుల విధుల నిర్వహణ తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. వికారాబాద్ గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రికి 45 రోజుల్లో మెడికల్ ఎక్విప్‌మెంట్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అందజేస్తామన్నారు. వికారాబాద్ జీజీహెచ్‌కు ఎంఆర్ఐ స్కాన్‌ను మంజూరు చేస్తామన్నారు. జనాభా ప్రాతిపదికన, ప్రజలకు దూరాన్ని దృష్టిలో పెట్టుకొని ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పునఃపరిశీలించి రోడ్డు భద్రత సమావేశాలను నిర్వహించి బ్లాక్‌స్పాట్‌లను గుర్తించాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు. ప్రమాదాలు సంభవించిన సమయంలో సత్వర వైద్య సేవలు అందించేందుకు ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు రూ.5.5కోట్ల నిధులను వెచ్చిస్తామని వివరించారు. ఆస్పత్రుల్లో మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రుల్లో అధికారులు అందుబాటులో లేరని ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎంహెచ్ఓ, డిప్యూటీ డీయంహెచ్ఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి పీహెచ్‌సీ, సబ్ సెంటర్లలో వైద్య సేవలను మెరుగుపర్చాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వేతర ఆస్పత్రులను ఎప్పటికపుడు తనిఖీ చేయాలన్నారు. నూతనంగా మంజూరైన వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగిరంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అధ్యాపకులు, విద్యార్థులు ఇబ్బంది పడకుండా ప్రాధాన్యత క్రమంలో వసతిగృహాలు, సిబ్బంది క్వార్టర్స్ నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ అజయ్‌కుమార్, అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరవణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంచంద్రయ్య, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్, డిప్యూటీ డీఎంహెచ్ఓలు, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

గాలిహోరు.. వాన జోరు

- రోడ్డుపై కూలిన వృక్షాలు
- ట్రాఫిక్ అంతరాయం



వికారాబాద్-మన్నెగూడ మార్గంలో ఈదురుగాలులకు రోడ్డుపై విరిగిపడిన చెట్టు

పూడూరు: మండల పరిధిలో సోమవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సాయంత్రం కురిసిన ఈ వర్షానికి ఎన్కేపల్లి సమీపంలో వృక్షం రోడ్డుపై కూలింది. దీంతో భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వాహనాదారులు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో జొన్న పంటలు దెబ్బతిన్నాయి.



కండ్లపల్లి గేట్ సమీపంలో రోడ్డుపై నిలిచిన వాహనాలు

క్లుప్తంగా

కారు అదుపు తప్పి యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు

ఆమనగల్లు: విఠాయిపల్లి సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన అజయ్‌కుమార్(30) మృతిచెందాడు. ఆమనగల్లు ఎస్‌ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన స్నేహితులు మనోజ్, అజయ్‌కుమార్, గణేశ్, త్రిమూర్తులు స్విఫ్ట్ కారులో శ్రీశైలం వెళ్తున్నారు. విఠాయిపల్లి సమీపంలో పంది అడ్డు రావడంతో అజయ్‌కుమార్ కారును ఒక్కసారిగా పక్కకు తిప్పాడు. వాహనం అదుపు తప్పడంతో రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అజయ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వైద్య సేవల్లో నర్సుల పాత్ర కీలకం

మహేశ్వరం: వైద్య సేవల్లో నర్సుల పాత్ర ఎంతో కీలకమని అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ అన్నారు. మండల పరిధిలోని భగవతిపురంలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి, నర్సులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అవేర్ సంస్థ డీజీ రాజవర్ధన్‌రెడ్డి, అవేర్ ఆస్పత్రి ఎండీ, ప్రొఫెసర్ ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పౌల్ట్రీ యజమాని మృతి


లీల్యా నాయక్ (ఫైల్)

కేశంపేట: కోళ్లకు దాణా పంపిణీ చేసే యంత్రం పైన పడటంతో పౌల్ట్రీ ఫాం యజమాని మృతిచెందిన ఘటన కాకునూర్ శివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లీల్యానాయక్ (48) ఊరి శివారులో కోళ్ల ఫారం నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులతో ఫాంలోని దాణా యంత్రం పక్కకు జరిగింది. బీహార్ చెందిన కూలీలు కమల్‌సాదా, చింటూసాదాతో కలిసి సరిచేసేందుకు ప్రయత్నిస్తుండగా మిషన్ ఒక్కసారిగా ముగ్గురిపైనా పడింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా లీల్యానాయక్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. గాయాలపాలైన చింటూ, కమల్‌సాదా ఆరోగ్యం నిలకడగా ఉందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ నరహరి తెలిపారు.

ఉద్యమకారుడిని కోల్పోయాం.

తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న లీల్యానాయక్ మృతి బీఆర్‌ఎస్‌కు తీరని లోటని మాజీ ఎంపీపీ ఎల్లగమోని రవీందర్ యాదవ్ అన్నారు. పీఏసీఎస్ చైర్మన్ గంగ్ర జగదీశ్వర్‌గౌడ్ తదితరులు లీల్యా మృతిపై సంతాపం వ్యక్తంచేశారు.

బస్సు ఢీకొని మహిళలకు తీవ్ర గాయాలు

షాద్‌నగర్ రూరల్: ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన పట్టణ సమీపంలోని పరిగి రోడ్డులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. షాబాద్ మండలం అంతారానికి చెందిన శివకుమార్ తన భార్య అనూషను ఆస్పత్రిలో చూపించేందుకు బైక్‌పై షాద్‌నగర్ వచ్చాడు. తిరిగి వెళ్తుండగా పరిగి రోడ్డులోని విష్ణు గ్రానైట్ సమీపంలో వెనక నుంచి వచ్చిన ఆర్టీసీ అద్దె బస్సు వీరిని ఢీకొట్టింది. బస్సు చక్రాలు అనూష కాలిపైనుంచి వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై.. ప్రమాదంలో మా తప్పేమీ లేదని, శివకుమార్ మద్యం తాగి ఉన్నాడని, బైక్ అదుపు తప్పడంతో బస్సును ఢీకొన్నాడని యజమాని ఫిర్యాదు చేశాడు. ఇరువురి ఫిర్యాదులు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడిన వ్యక్తిని అంబులెన్స్‌లో తరలింపు

కడ్తాల్: ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గానుగుమార్లతండాకు చెందిన మూడవత్ సోమ్లా ద్విచక్రవాహనంపై సోమవారం రాత్రి తండా నుంచి కడ్తాల్ వైపు వస్తున్నాడు. అదే సమయంలో రామస్వామి అనే వ్యక్తి కడ్తాల్ నుంచి అన్మాస్‌పల్లి బయలుదేరాడు. మార్గమధ్యలో కడ్తాల్– అన్మాస్‌పల్లి రహదారిపై ఇద్దరి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గాయపడినవారిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

జిల్లా ఆస్పత్రిలో కార్పొరేట్ వైద్యం

- త్వరలో గుండె, న్యూరో సంబంధిత సర్జరీలు
- పీహెచ్‌సీల అప్‌గ్రేడ్‌కు ఉత్తర్వులివ్వాలని వైద్యారోగ్య కార్యదర్శికి మంత్రి ఆదేశం


తాండూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి

తాండూరు: కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రితో పాటు సీహెచ్‌సీ, పీహెచ్‌సీ ఆస్పత్రులు అప్‌గ్రేడ్ కానున్నాయి. పట్టణంలో రెండున్నర దశాబ్దాలుగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. ఇప్పటి వరకు ఆస్పత్రిలో మైనర్ సర్జరీలే జరుగుతున్నాయి. గుండె, న్యూరో సంబంధిత సర్జరీలు ఆస్పత్రిలో నిర్వహించేందుకుగాను కావాల్సిన పరికరాలను తీసుకురానున్నారు. కిడ్నీ వ్యాధి గ్రస్తుల సంఖ్య పెరగడంతో ఇప్పటికే అందుబాటులో ఉన్న డయాలసిస్ బెడ్లను పెంచనున్నారు. రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి సత్వర వైద్య సేవలు అందించేందుకుగాను ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది.

సీహెచ్‌సీ, పీహెచ్‌సీల అప్‌గ్రేడ్

నియోజవకర్గంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అప్ గ్రేడ్ చేయాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు విన్నవించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి వారం రోజుల వ్యవధిలో తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్ పీహెచ్‌సీలో 24 గంటల పాటు వైద్య సేవలు అందించేలా ఉత్తర్వులు అందిస్తానని ఎమ్మెల్యే బీఎంఆర్‌కు హామీ ఇచ్చారు. బషీరాబాద్ మండలంలో ఉన్న రెండు పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్‌తో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ఉత్తర్వులు జారీ చేయాలని వెంటనే వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి అజయ్‌కుమార్‌ను మంత్రి ఆదేశించారు.

త్వరలో ఐసీయూ సేవలు



తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి ప్రాణాపాయ స్థితిలో వచ్చే వారికి సత్వర వైద్య సేవలు అందించేందుకు ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ) విభాగాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం. అందుకోసం వైద్యారోగ్యశాఖ మంత్రిని అడిగిన వెంటనే సానుకూలంగా స్పందించారు. కార్పొరేట్ ఆస్పత్రి తరహాలో జిల్లా ప్రభు త్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్నాం. – బుయ్యని మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాండూరు

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల వడపోత

రెండు రోజుల్లో జాబితా సిద్ధం

- తిరస్కరించిన వారి స్థానంలో కొత్తవారికి కేటాయించాలని విజ్ఞప్తి


ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ప్రజావాణిలో అర్జీ ఇస్తున్న శ్రీహరి, రాములు

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల జాబితా సిద్ధమవుతోంది. అధికారులు క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరిగి దరఖాస్తుల వడపోత ప్రక్రియ ప్రారంభించారు. పైలెట్ ప్రాజెక్టు కింద చెన్‌గేస్‌పూర్ గ్రామాన్ని ఎంపిక చేశారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరవ్వగా తాండూరు మండలంలోని 33 గ్రామాలకు 722 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారు. మరో రెండు రోజుల్లో లబ్ధిదారుల ఫైనల్ జాబితా సిద్ధం చేయనున్నట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు.

దరఖాస్తుల వడపోత

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్ల జాబితాను అందజేశారు. నాయకులు ఇచ్చిన జాబితాను మండల వెరిఫికేషన్ కమిటీ సభ్యులు ఎంపీడీఓ, ఎంఈఓ, పీఆర్ ఏఈలు దరఖాస్తులను వడపోత ప్రక్రియను ప్రారంభించారు. మల్కాపూర్ గ్రామంలో 55 ఇళ్లకు గాను 25 తిరస్కరించినట్లు సమాచారం. ఐదు ఎకరాలకు పైన భూమి కారు, ట్రాక్టర్, ప్రభుత్వ ఉద్యోగం, ఆర్‌సీసీ స్లాబ్ ఉన్న దరఖాస్తులను అధికారులు రిజెక్ట్ చేస్తున్నారు.

తమవారి పేరుండాల్సిందే

ఇందిరమ్మ ఇళ్ల జాబితా సిద్ధం అవుతున్న తరుణంలో నాయకులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తమ వారి పేర్లు లబ్ధిదారుల లిస్టులో కచ్చితంగా ఉండాలని కోరుతున్నారు. అవసరమైతే ఎమ్మెల్యేతో మాట్లాడిస్తామంటున్నారని సమాచారం. ఒక్కో గ్రామంలో కాంగ్రెస్‌లో రెండు వర్గాలుంటే ఇద్దరి మధ్య సయోధ్యను కుదిర్చి జాబితాను సిద్ధం చేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఇళ్లు కేటాయించండి

సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో తమకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని పలువురు అర్జీలు పెట్టుకున్నారు. కరన్‌కోట్ గ్రామానికి చెందిన శ్రీహరి, చంద్రవంచ గ్రామానికి చెందిన రాములు తమ పేర్లను జాబితాలో చేర్చాలని కోరారు.

గోశాలకు 48 గోవుల తరలింపు


మాట్లాడుతున్న హిందూ సంఘాల నాయకులు, బీజేపీ నేతలు

కుల్కచర్ల: నగరానికి అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన గోవులను హిందూ సంఘాల నాయకులు అడ్డుకున్నారు. ఈ ఘటన మండల పరిధిలోని బండవెల్కిచర్లలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మోహన్ గోవులను నగరానికి తరలిస్తున్నాడనే సమాచారం తెలుసుకున్న హిందూ సంఘాలు, గోసంరక్షణ సంఘాలు అక్కడకు చేరుకున్నారు. వారు మోహన్‌ను ప్రశ్నించడంతో గోవులు నగరానికి చెందిన ఖాసీం అనే వ్యక్తివని వాటిని సంరక్షిస్తున్నందుకు గాను తనకు వేతనం ఇస్తున్నాడని చెప్పారు. విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలికి చేరుకున్నారు. 48 గోవులను కరణ్‌కోట్ గోశాలకు తరలించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చెంచు హన్మంత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, మండల అధ్యక్షుడు వెంకటయ్యముదిరాజ్, ప్రధాన కార్యదర్శి హన్మంతు, రఘోత్తమస్వామిజీ, కాంగారి ఆంజనేయులు, రాజేశ్వర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో ఇద్దరు నిందితులకు జీవితఖైదు

యాలాల: హత్య కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.వేయి జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి సున్నం శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తీర్పునిచ్చారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ నారాయణరెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 2015లో కొడంగల్ మండలంలోని ఎరన్‌పల్లికి చెందిన తండ్రీకొడులు రాములుగౌడ్, రవీందర్‌గౌడ్‌లను చంపుతానంటూ అదే గ్రామానికి చెందిన దోమ బుగ్గప్ప బెదిరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కొడంగల్ పీఎస్‌కు చెందిన కానిస్టేబుల్ హరిలాల్ ఏప్రిల్ 2న బుగ్గప్పను విచారణ నిమిత్తం బైక్‌పై ఎక్కించుకొని కొడంగల్‌వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాములుగౌడ్, లక్ష్మయ్యగౌడ్, నర్సప్పతో మరో ఇద్దరు రెండు మోటారు సైకిళ్లతో కానిస్టేబుల్ బైక్‌ను అడ్డగించారు. బైక్‌పై కూర్చున్న బుగ్గప్పను కిందకు లాగిన అనంతరం రాములుగౌడ్ వేట కొడవలితో దాడి చేశాడు. రోడ్డుపై పడిపోయిన బుగ్గప్పపై మిగతా వారు సైతం దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో బుగ్గప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. కానిస్టేబుల్ హరిలాల్ ఫిర్యాదు మేరకు అప్పటి యాలాల ఎస్‌ఐ రవికుమార్ కేసు నమోదు చేయగా, రూరల్ సీఐ శివశంకర్ కేసు దర్యాప్తు చేపట్టారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన జిల్లా జడ్జి హత్య కేసులో ప్రమేయం ఉన్న ఎ–1 ఈడ్గి రాములుగౌడ్, ఎ–2 ఈడ్గి లక్ష్మయ్యగౌడ్‌లకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.వేయి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పీపీలు నారాయణగౌడ్, రవికుమార్, సుధాకర్‌రెడ్డి, దర్యాప్తు అధికారులు రవికుమార్, శివశంకర్, ప్రస్తుత రూరల్ సీఐ నగేష్, యాలాల ఎస్‌ఐ గిరన్న, సీడీఓలు శ్రీశైలం, శ్రీనివాస్, బ్రీఫింగ్ అధికారులు వీరన్నలను ఎస్పీ నారాయణరెడ్డి అభినందించారు.

గడ్డివాము దగ్ధం


సలిగుట్టతండాలో కాలిపోయిన గడ్డివాము

మంచాల: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో గడ్డి వాము దగ్ధమైన ఘటన లోయపల్లి అనుబంధ గ్రామం సలిగుట్టతండాలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు సమీపంలోని తన వ్యవసాయ పొలం వద్ద రైతు మేఘావత్ ఫకీర గడ్డి వాము ఏర్పాటు చేసుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు దీనికి నిప్పంటించడంతో వాము పూర్తిగా దగ్ధమైంది. రూ.50 వేల విలువైన గడ్డి కాలిపోయిందని ఫకీర ఆవేదన వ్యక్తంచేశాడు. బాధితుడికి ప్రభుత్వం సాయం చేయాలని కాంగ్రెస్ నాయకుడు మహేందర్‌జీ, జంగయ్యగౌడ్, శివశంకర్ తదితరులు కోరారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ఎదుట బాధితులతో కలిసి ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ఎదుట సీఐటీయూ నాయకుల ధర్నా

మొయినాబాద్ రూరల్: హిమాయత్‌నగర్‌లోని పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో పని చేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు రుద్రకుమార్, అల్లి దేవేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. నాన్ టీచింగ్ స్టాఫ్‌తో కలిసి సోమవారం పాఠశాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రైవర్లు, క్లీనర్లు, ఆయాలుగా పనిచేస్తున్న కార్మికుల వేతనాలు చెల్లించకుండా యాజమాన్యం ఇబ్బంది పెడుతోందని మండిపడ్డారు. వీరందరికీ వెంటనే గుర్తింపు కార్డులు, నెలాంతర, సాధారణ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు ముంజగళ్ల ప్రభుదాస్, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

మైలార్‌దేవ్‌పల్లి: వేగంగా వచ్చిన ఓ కారు (టీజీ07జే73335) అదుపు తప్పి పల్లెచెరువు సమీపంలోని ఓ డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. కారులో ఇద్దరు ప్రయాణిస్తున్నట్లు స్థానికులు వెల్లడించారు. ఆరాంఘర్ నుంచి చంద్రాయణగుట్ట వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే కారు బెలూన్లు ఓపెన్ కావడంతో కారులోని ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు నుజ్జునుజ్జు అయింది. స్థానికులు వెంటనే గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

106 కిలోల గంజాయి పట్టివేత

ఉప్పల్: ఉప్పల్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు రూ. 50 లక్షల విలువైన 106 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఓంకార్ కేసు వివరాలు వెల్లడించారు. మేడిపల్లిలో ఉంటున్న హనుమకొండ ప్రాంతానికి చెందిన కట్ల వివేక్ రెడ్డికి వరంగల్‌లో ఉంటున్న పశ్చిమ గోదావరి జిల్లా, చింతలపూడి గ్రామానికి చెందిన దగ్గుమల్లి మధుకిరణ్‌తో పరిచయం ఉంది. జల్సాలకు అలవాటు పడిన వీరు సులువుగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి ప్రాంతానికి చెందిన కర్నెన్ రాంబాబు అలియాస్ రాముతో ఒప్పందం చేసుకుని అతని ద్వారా గంజాయి అక్రమ రవాణాకు తెరలేపారు. రాంబాబు చెప్పిన వ్యక్తికి గంజాయి అందజేస్తే ఒక్కో డీల్‌కు రాంబాబు వారికి రూ.50 వేలు కమీషన్‌గా ఇచ్చేవాడు. ఇదే తరహాలో పలుమార్లు గంజాయి తీసుకువచ్చి అవసరమైన వారికి అందజేశారు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం ఇద్దరు వ్యక్తులు మల్లాపూర్‌లోని హెచ్‌సీఎల్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు గుర్తించిన స్థానికులు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఉప్పల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఓంకార్, సిబ్బంది వారిని అదుపులోకి తీసుకుని ఆరా తీయగా ఒడిశాకు చెందిన రాంబాబు కారులో తీసుకు వచ్చి వారికి అప్పగించినట్లు వెల్లడైంది. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు పక్కనే ఉన్న భవనంలో డంప్ చేసిన 106 కిలో గంజాయి, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సూత్రధారి రాంబాబుతో పాటు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఒంటరితనం భరించలేక..

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్: ఒంటరితనం భరించలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరశురాం కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గోదావరిఖనికి చెందిన గుటుకు శ్రీశైలం (45) ఘట్‌కేసర్‌కు వలస వచ్చి బోగారం లిక్కర్ గోదాములో కూలీగా పనిచేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో అతను మూడు నెలలుగా స్థానిక బాలాజీనగర్‌లోని ఓ గదిలో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. సోమవారం అతడి గది నుంచి దుర్వాసన వస్తున్నట్లు గుర్తించిన ఇంటి యజమానురాలు కాశమ్మ శ్రీశైలం కుమార్తెకు సమాచారం అందించింది. దీంతో ఆమె తండ్రికి ఫోన్ చేయగా స్పందించకపోవడంతో బాలాజీనగర్‌లో తండ్రి ఉంటున్న ఇంటికి వచ్చింది. స్థానికుల సాయంతో తలుపులు తెరిచి చూడగా శ్రీశైలం బెడ్‌రూంలో చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. కుటుంబ కలహాలు, ఒంటరితనంతో మనస్తాపానికి లోనై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతుడి కుమార్తె ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పిన ఆటో ట్రాలీ

- ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె, స్తంభాలను ఢీకొట్టిన వాహనం
- ఏడు గంటలపాటు ఆగిన విద్యుత్ సరఫరా

రాజేంద్రనగర్: అదుపుతప్పిన ఓ ఆటో ట్రాలీ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెతో పాటు విద్యుత్ స్తంభాలను ఢీకొట్టిన సంఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ బుద్వేల్ ప్రధాన రహదారిపై ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వివరాలివీ... బుద్వేల్ ప్రధాన రహదారిపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి స్థానికంగా ఉన్న రెండు బస్తీలకు విద్యుత్ సరఫరా అవుతోంది. సోమవారం మధ్యాహ్నం చింతల్‌మెట్ ప్రాంతానికి చెందిన వాటర్ క్యాన్లను సరఫరా చేసే ఆటో ట్రాలీ వేగంగా దూసుకొచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో విద్యుత్ స్తంభం విరిగి కిందపడగా... ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ధ్వంసమైంది. అదృష్టవశాత్తు ఈ సంఘటన కారణంగా ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ఆటో ట్రాలీ డ్రైవర్‌ను నిలదీశారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ కారణంగానే తన ఆటోకు ప్రమాదం జరిగిందని... తనకే నష్టం పరిహారం చెల్లించాలని వాగ్వాదానికి దిగాడు. ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు స్తంభం ఏర్పాటుకు డబ్బులు చెల్లించాలని సిబ్బంది కోరడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీని కారణంగా దాదాపు 6 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయి పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చివరకు విద్యుత్ శాఖనే మరమ్మతులు చేసింది. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఏఈ తెలిపారు.

వేసవి దుక్కులతో చీడపీడల నివారణ

- నేల ఆరోగ్య యాజమాన్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పవన్‌చంద్రారెడ్డి
- పెద్దగోల్కొండలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

శంషాబాద్ రూరల్: వేసవి దుక్కులతో పంటలకు ఆశించే చీడపీడల నివారించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నేల ఆరోగ్య యాజమాన్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.పవన్‌చంద్రారెడ్డి సూచించారు. పెద్దగోల్కొండలో సోమవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు వాతావరణ ఆధారిత సలహాలు, సూచనలు పాటించి సాగు చేసుకుంటే నష్టాలు రాకుండా చూసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలకు తగు మోతాదులోనే ఎరువులు వాడాలని సూచించారు. పంట మార్పిడి, సేంద్రియ ఎరువులతో పెట్టుబడి తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ జి.వినయ్ మాట్లాడుతూ... రైతులు సమగ్ర వ్యవసాయ విధానాన్ని అవలంబిస్తూ ఎరువుల వాడకాన్ని తగ్గించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పశువుల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రతలను మండల పశువైద్యాధికారి డాక్టర్ జి.శేఖర్ వివరించారు. ఇందుకు సంబంధించి రూపొందించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నార్సింగ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎ.శ్రీకాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, సొసైటీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, రైతులు భాస్కర్‌గౌడ్, భోజిరెడ్డి, పాండురంగారెడ్డి, నర్సింహారెడ్డి, ఏఈఓ రాఘవేందర్‌గౌడ్, వ్యవసాయ కళాశాల పరిశోధన విద్యార్థిని వి.వర్షిత తదితరులు పాల్గొన్నారు.

కార్డు చూపితే కాజేశారు!

రూ.1.8 లక్షలు స్వాహా చేసిన నేరగాళ్లు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ బాధితుడు సైబర్ నేరగాళ్లకు ఓటీపీలు చెప్పకున్నా.. వీడియో కాల్ ద్వారా తన క్రెడిట్‌కార్డు చూపడంతో రూ.1.8 లక్షలు నష్టపోవాల్సి వచ్చింది. దీనిపై సోమవారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నగరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగికి (48) ఇటీవల ఓ ఫోన్ కాల్ వచ్చింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) క్రెడిట్ కార్డ్స్ విభాగానికి చెందిన కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నట్లు సైబర్ నేరగాడు చెప్పాడు. బాధితుడు సుదీర్ఘ కాలంగా తన క్రెడిట్ కార్డు వినియోగించట్లేదు. ఈ కారణంగా బ్యాంకు భారీ పెనాల్టీ విధించిందని నేరగాడు చెప్పాడు. ఆ మొత్తాన్ని మాఫీ చేస్తానంటూ వీడియో కాల్‌కు మార్చాడు. క్రెడిట్ కార్డును, దాని సీవీవీ నెంబర్‌ను చూపించమని కోరాడు. అతడి మాటలు నమ్మిన బాధితుడు అలానే చేయడంతో ఆ క్రెడిట్ కార్డు నుంచి కొంత మొత్తం డెబిట్ అయింది. బాధితుడు ఓటీపీలు (వన్–టైమ్ పాస్‌వర్డ్) వచ్చినప్పటికీ దఫదఫాలుగా రూ.1.8 లక్షలు డెబిట్ అయినట్లు సందేశాలు వచ్చాయి. సదరు క్రెడిట్‌కార్డు లిమిట్ కేవలం రూ.50 వేలే అయినప్పటికీ ఇంత మొత్తం పోయిందంటూ బాధితుడు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశాడు.

పరిశ్రమల సహకారంతో నైపుణ్యాల వృద్ధికి కృషి


కార్యక్రమంలో పాల్గొన్న నాస్‌కామ్ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు

శంషాబాద్ రూరల్: మండలంలోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నాస్‌కామ్ ఆధ్వర్యంలో అనుభవాత్మక ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. పాఠ్యాంశంలో కలిపే అంశాలతో పాటు సహకార నమూనాలు, పట్టభద్రుల నైపుణ్య లక్ష్యాలకు అనుసంధానం, అమలుకు తగిన వ్యూహాల వాటిపై చర్చించారు. నాస్‌కామ్‌తో కళాశాల చేసుకున్న ఎంఓయూలో భాగంగా విద్యార్థులకు పరిశ్రమ అనుభవం, ఉపాధికి అనుగుణమైన నైపుణ్యాలు అందించడానికి దోహదపడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.ఆర్.రవీంద్ర అన్నారు. పరిశ్రమల సహకారంతో నైపుణ్యాల అభివృద్ధికి ఇది ఒక మార్గదర్శక మోడల్‌గా నిలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్‌ఈపీ 2020 అనుగుణంగా క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్‌లను పాఠ్యాంశంలో సమగ్రంగా ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాస్‌కామ్ ప్రతినిధులు షీబా థామస్, కమ్రాన్ అష్రఫ్, సీనియర్ కన్సల్టెంట్, కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపిటెన్సీస్ వై.రామ్మోహన్‌రావు, కళాశాల కంప్యూటర్ సైన్ డీన్ డాక్టర్ జి.వేంకటరామిరెడ్డి, పరిశోధన డీన్ డాక్టర్ జె.కృష్ణచైతన్య, విద్యా వ్యవహారాల డీన్ డాక్టర్ ఎస్.రాజేందర్, మూక్స్ అండ్ ఐఐఐసీ ఇంచార్జి డాక్టర్ ఎస్.వి.వసంత, ఎంఓఓసీఎస్ హెడ్ డాక్టర్ డి.కృష్ణ, పాల్గొన్నారు.